# పేరు కోసం

హరి ఎప్పుడూ కథలు వ్రాసిన పాపాన పోలేదు. కాని వాడు తనంత తా వచ్చి, తనో కథ వ్రాశానని చెప్పడమే కాకుండా, అది స్వయంగా చదివి వినిపించినప్పుడు 'అరే, చాల చక్కనికథ వ్రాశావే!' అన్నాను. వెంటనే, 'ఎప్పుడూ పుస్తకాలంటే తలకాయ నొప్పి అనే వాడివి ఎలా రాశావురా ఇంత చక్కగా' అని కూడ అనేశాను. వాడు బాధపడి వుండొచ్చు. అయినా నేను మాత్రం అలా అనకుండా ఉండలేక పోయాను. ఎందుకంటే తెలుగులో వాడి కెప్పుడూ అత్తెసరు మార్కులే! అయినా ఈమధ్య అర్థరాత్రులుకూర్చుని సాధనం చేశాడేమో...! ఎవరు చెప్పగలరు? ఎంతమంది అకస్మాత్తుగా తెలివైన వాళ్లు ఐ పోలేదు. వాళ్ళల్లో వీడొకడు కాకూడదా! నిజాని కా కథ నన్ను చాల ముగ్ధుణ్ణి చేసింది.

'అయితే ఈ కథను పత్రికకు పంపించ వచ్చన్నమాట' అన్నాడు చాల తాపీగా.

'ఇంకా అనుమాన మేమిటిరా? అది పంపించిన వెంటనే పడుతుంది' అన్నా చురుగ్గా.

హరి ఏదో అనుమానించి నట్టుగా ఊరుకున్నాడు. 'ఏమిటిరా అలా సందేహిస్తావు. నేను ఛాలంజిచేసి చెప్తాను. తప్పకుండా అది పడుతుంద'ని అన్నా.

హరి అందుకున్నాడు- 'దానికి కాదురా! అది తప్పక వేసుకుంటారని నాకూ తెలుసు. అసలిప్పుడీ కథతోబాటు నా పేరుకూడ పడటం నా కిష్టంలేదు. అదే నేను ఆలోచిస్తున్నది. నేనప్పుడే కవినైపోయానని ఎవ్వరికీ తెలియకూడదు. అది నేనే వ్రాసేనని తెలియగానే మన వాళ్ళెవ్వరూ నిక్కచ్చిగా దానిలోని తప్పొప్పులు చెప్పరు. సరియైన విమర్శ చెయ్యరు. అది ఎవ్వరు వ్రాశారో తెలియక పోవడంవల్ల నాముందు వాళ్లు తమ అభిప్రాయాన్ని సూటిగా చెప్పెయ్యగలుగుతారు. అప్పుడు నేనింతకన్నా మంచివి వ్రాయటానికి వీలుచిక్కుతుంది. అసలు మనవాళ్ళు మారు పేర్లతో వ్రాసి ఆ పేర్లు స్నేహితులందఱికి చెప్పేసుకుంటారు. అది నాకిష్టం లేదు. ఆ పేరు జీవితాంతం వరకూ ఇతరులకు తెలియకూడదని నా అభిప్రాయం. మామూలుగా నువ్వు కవివై పోయావులే అన్నప్పుడు కలిగే ఆనందంకన్నా 'ఫలాని మారు పేరు వాడు ఎంత అద్భుతంగా కథలు సృష్టిస్తున్నాడు' అని మనవద్దే అంటున్నప్పుడు కలిగే ఆనందం వేయిరెట్లు హృదయానికి సుఖాన్నిస్తుంది. అయితే మారు పేరు ఏమి పెట్టుకోమంటావు?

నాకు మారుపేర్లంటే ఇష్టంలేదు. అంత భయమున్న వాళ్ళు వ్రాయడం మానేస్తేనే బాగుంటుం దనుకుంటా. భయ

పడ్డవాడు కవిగా పనికిరాడని నాఊహ. తాను ఏ విషయాన్ని చెప్పదలచు కున్నాడో ఆ విషయాన్ని చాటుగుండా చెప్తు తున్నాడు...దొంగతనంగా మీద రాళ్ళేసినట్టు. ఇంతకన్నా అన్యాయం ఇంకొకటిలేదు. అలాంటిపని చేసేముందు అలాంటి రచనలు సాగించడం మానివేస్తేనే మంచి దనిపిస్తుంది. ఇది ఆత్మవంచన అయినా వాణ్ణి నొప్పించడ మెందుకని 'సరే ఏదో పేరు నీకు నచ్చింది పెట్టుకో' అన్నాను.

'అరే, నిన్నడిగితే మళ్ళీ నామీద పెడతా వేమిటి? నీకు మారుపేర్లంటే అంత ఇష్టం లేదనుకుంటా. అయినా ఒక్క దూరాలోచన మాత్రం చెయ్యి. ఒకవేళ గొప్ప కథలు రచిస్తామనుకో. అప్పుడు ఆ కవిని సన్మానించాలని, ఆతన్ని చూడాలని, ఆతన్ని గురువుగా పొందాలని ప్రజలలో గొప్ప అలజడి వస్తుంది. కాని, వాళ్ళకు కావలసినవాడు దొరకడు. అప్పుడు ఇష్టమొచ్చినన్ని ఊహలు బయలు దేరుతాయి— ఈకవి ఏదో పెద్ద దెబ్బతిని ఉంటాడని–ఆత నొక మహర్షి అయి ఉంటాడని– పేరుప్రతిష్ఠ లంటే ఆతనికి తృణప్రాయమని -ప్రజా సేవ అంటే ఆతనికి అపరిమితమైన వాంఛ అని — అనేకమంది విద్యార్థులు ఏకలవ్యునివంటి శిష్యులవుతారు. అప్పుడుకూడ నేను బయటకు రాను. ఇక ఈ రూపంలో ఉండే ఆ కవిని అంటే నన్నే, నా అసలు పేరుతో వాళ్ళెదురుగుండా తిట్టడం, ఏకడం, ప్రారంభిస్తా. అప్పుడు నన్ను దూషిస్తారు. నన్ను ఒక మహా వ్యక్తినిగుర్తించలేని అంధు డంటారు. వాళ్ళకు ప్రియతము

డైన కవి పుంగవుని తూలనాడే నన్ను ఏమి చెయ్యాలో తోచక వాళ్ళు పేపర్లలో నన్ను దుమ్మెత్తి పోస్తూంటారు. అప్పుడు నువ్వే ఊహించుకో - అదిఎట్టి ఆనందమో ! చివరికి నేను చచ్చిపోతాననుకో. ఓ సత్కవిని దూషిస్తూ అతన్ని చెడ్డగా విమర్శించే ఓ వాజమ్మ చచ్చిపోయాడని పత్రికలో పడ్డప్పుడు పాఠకలోకం, అతని ఏకలవ్యశిష్య బృందం, మారు పేరుకవిని మెచ్చుకునే పెద్దతలకాయలు నన్ను ఆ నరకాసురుడు చచ్చినట్టు సంతోషిస్తారు. కాని అప్పుడు నువ్వు నా అసలు సంగతి బయట పెడతావు. దానితో నన్ను చూడలేక పోయేమని, ఆ మహాకవిని నేనేనని, తన్ను తనే విమర్శించుకుంటూ తనెవ్వరో చెప్పకుండా అజ్ఞాతంగానే చచ్చిపోయాడని నీవు వాపోయి నప్పుడు నా చితాభస్మం కోసం ఎంతమంది బయలుదేరి వస్తారంటావు ? కొందఱు ఏనుగుమీద ఊరేగించి ఉందుమంటారు- కొందఱు రజతరథంమీద మహా వైభవంగా సన్మానించి ఉందు మంటారు - కొందఱు కనకాభిషేకంచేసి ఉందుమంటారు- నా రచనలన్నీ ఇతర భాషల్లోకి అనువదించాలని ప్రయత్నాలు చేస్తారు. కొంతమంది వాటిని తర్జుమా చేసి పరదేశాలకు పంపుతారు. వాళ్ళొక్కసారి చకితులై వాటికి నోబిలు ప్రైజులూ మొదలైన వివ్వడానికి పూనుకుంటారు. నిన్ను నా జీవిత చరిత్ర వ్రాయమంటారు. నా కోసం ఓనిధి వసూలు చేస్తారు. నాకథ సినిమాకూడ తీయవచ్చు.

ఇక నాఫోటోసంగతి చెప్పనే అక్కర్లేదు - ఎక్కడ చూచినా అవే వుంటవి. పాలరాయిలో నా విగ్రహాన్ని చెక్క

రంటావా ? ఇది నిజంగా మనం ఊహించలేని ఆనందం. అది దివ్యమైనది - అంతే కదూ ?'

— అని హరి ఏకధాటిగా ఉపన్యసించేటప్పటికి నే నాశ్చర్యపోయా... వాడిలో గొప్పవాడు కాబోయే లక్షణాలు హెచ్చుగా ఉన్నాయని. కాని అందులో ఏదో వెలితి... ఏదో నా కయిష్టమైనది... ఉన్నట్టు భావించాను.

అయితే, నీవే ఓ పేరు పెట్టుకుందూ— నాకేమీ తోచడం లేదన్నా. వాడా మారుపేరు నా చెవిలో ఊదాడు. నేను ఊకొట్టాను. వాడు ఈపేరుఎవరికీ తను చచ్చిపోయేవరకు చెప్పవద్దని ఒట్టువెయ్యమన్నాడు. నే నలాగే అన్నాను.

రోజులు గడిచిపోతున్నాయి. హరి రోజూ ఏదో ఓ క్రొత్తసంగతి చెబుతూనేఉన్నాడు. తనగుఱించి ఏమేమి క్రొత్త ఊహలు పుట్టుకొచ్చాయో తెలియబరుస్తున్నాడు. ఒకరోజున నే నొక్కణ్ణే స్టేషనుకు వెళ్లాను. వాడు కథపంపించిన పత్రిక మెయిలులో దిగింది. నేను కొన్నాను. పేజీలు త్రిప్పిచూశాను గదా అందులో ఒకచోట ఇలా వ్రాయబడిఉంది. నేనాశ్చర్య పోయాను. అబ్బ ఎంతదగా! అది ఇది:

'ఈకథ నెవ్వరో దొంగిలించి దానిపేరు మార్చి, కథలో అక్కడక్కడ తోచిన మార్పులుచేసి, 'తెలియబడనివాడు' అన్న మారుపేరుతో మాకు పంపిఉన్నారు. ఈ కథ శ్రీ ... ... ... గారు వ్రాసినదని మాకు తెలుసు. నిజంగా దేశంలో ఇట్టి

ద్రోహాలు చేసే తెలివైన తెలియబడనివారుకూడా ఉన్నారని వ్రాయటానికి ఎంతో బాధపడుతున్నాము...!'

అది చదివేటప్పటికి నాకు వచ్చిన కోపాని కంతులేదు. ఓరి వీడి ఎత్తు తగలెయ్య. ఇవ్వాళ కాకపోతే రేపైనా తెలియదా? ఏమిటీ అఘాయిత్యం? నేను గబగబా బయలు దేరాను.

వాడింటివద్ద వా డెదురయ్యాడు. నా చేతిలోని పత్రిక చూసీ, చూసిన వెంటనే 'నాది పడిందా?' అన్నాడు.

'ఆ...పడింది. విప్పీవిప్పగానే నీపేరు కనబడింది. అంటే ఆ మారు పేరు. కాని ఇంతలో ఆ సంపాదకుడు పెద్ద పెద్ద అక్షరాలతో ఎంత గొప్పగా వ్రాశాడో తెలుసా? ఇంత ఆనందం, న్వావు చచ్చిపోయిం తర్వాత సంపాదించాలను కున్నావు కాని, నువ్వు బ్రతికుండగా అదిచూసేట్టు ఉన్నావురా అది చదవగానే హృదయం పట్టలేనంత ఆనందం కలిగి, వెంటనే ఓ కార్డు తీసుకుని-'వాడు నా మిత్రుడేనని, వా డసలు ఫలానా వారి సుపుత్రుడని వాడిని ప్రజలందరికీ ఎరుకపరచవలసిందని, ఆ రచననీ నిన్నూ తెగ పొగిడేస్తూ వ్రాసేశాను' అనేసరికి వాడు తెల్లబోయాడు.

ఏమనాలో వాడికి తోచలేదేమో! కాసేపలా మాటా మంతీ లేకుండా ఉండిపోయాడు. 'ఏమిటీ ఏమిచేశావు?' అని మళ్లీ అడిగాడు, ఈ లోకంలో లేనటు. నేను మళ్ళీ చెప్పాను.

వాడు తననుదురు ఒక్కసారి గట్టిగా పట్టుకొని నా వైపు చంపే సేట్టుగా చూశాడు - 'నిన్ను ఒట్టు వేసుకోమన్నది అందు కటరా?' అన్నాడు. 'అందుకనే కదురా క్షమించమంటున్నాను. పోనీ, ఈసారి ఇంకో మారుపేరు పెట్టుకుందువుగానిలే. ఆపేరు నింకెప్పుడూ ఇప్పుడులా చెయ్యనులేరా' అన్నాను. కాని వాడు ఏదో తల్లక్రిందు లైపోయినట్లు కనిపించాడు.

వెంటనే ఎంతో నిరాశతో, గాభరాపడుతూ అన్నాడు: 'కొంప తీసేశావురా... నిజానికి నీ కా రచన ఎవ్వరిదో తెలియదు - అది నేను వ్రాసిందికాదు - అది ఓ గొప్పవాడు వ్రాసిందే. నేను దొంగిలించాను. దాని పేరుమార్చి, లోపల కొన్నిచోట్ల కత్తిరించి పత్రికకు పంపాను. ఎంత తప్పు చేశా నంటావు? నిజంగా ఇప్పుడెంత బాధనుభవిస్తున్నాను. అస లిలా పంపడానికి కూడ కొంత ధైర్యం ఉందిలే. అసలు నే నీ మధ్య పత్రికలకు కథలు పంపిస్తూ ఉన్నాను. ఈ సంగతి అవి పత్రికలలో పడితే చెప్పుదామను కున్నాను. కాని అవి పడడం లేదు. ఎప్పటికీ పడటంలేదు. ఇంతలో మా బావ వ్రాసినకథ ఒకటి పత్రికలో పడితే చదివాను. అది చదివి, అతనికి చాల బాగా వ్రాశావని ఉత్తరం వ్రాశాను. దాని కతని దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. అందులో ఏముందో తెలుసా!—నాఉత్తరం చూసి అత నాశ్చర్య పోయాడట. అది పడ్డట్టు అతనికే తెలియదట. దాన్ని అతను అయిదు నెలల క్రిందట పంపినట్టు, రెండుమూడు నెలలు దానికోసం ఎదురు చూసినట్టు. ఇక పడదని ఊరు

కున్నట్టు వ్రాశాడు. పోనీ, ఇంతకీ అది అచ్చు వేసిన తరువాత దాని ప్రతి అయినా అతనికి పంపబడలేదట! అంతే కాదు, ఆ కథ పేరు మార్చబడి ఆకథలో కొన్ని మార్పులుగూడ జరిగాయట! పోనీ వేసుకోక పోయినా బాగుండును—అతను ఎంత విచారించాడో నేను చెప్పలేను. ఆ ఉత్తరం చదవగానే నా కొకటి తట్టింది. ఆ సంపాదకుడు అన్ని మార్పులు చేసిం తరువాత మాబావ పేరుకూడ మార్చేసి ఉంటే అది ఎవ్వరిదో కూడ తెలిసేది కాదుకదా అని. అయితే అలా నే నెందుకు చెయ్యగూడ దనుకున్నాను. మరి మాబావ పత్రికలు ఎప్పుడో కాని తిరుగ వెయ్యడు. మరి ఇతరులెవ్వరైనా అయితే తమ రచన పడిందా లేదా అని ప్రతిపత్రిక కొంటూ నిస్పృహ చెందుతూ ప్రోషిత భర్తృకలా అయిపోతారు. అంచాత అలా ఎప్పు డూచూసేవారు కాకుండా మాంచి ధీమాఉండి, తమకు తప్పక పత్రిక ప్రతి పంపబడుతుం దనుకున్న వాళ్ళ కథ దొంగి లించేస్తే మంచి దనుకొన్నాను. అలాగే చేశాను. తెలిసిపోతే అది వాడికి దక్కుతుంది – తెలియకపోతే అది మనదే అయి పోతుంది; అని ఊహ లల్లాను. ఇక నీకా పేరు ఎందుకు చెప్పానంటావు? నీకు ముందుగా ఆ మారుపేరు చెప్పకపోతే నువ్వు అది అచ్చయిన తరువాత నేను వ్రాశేనంటే నమ్మవు. పోనీ, నీ కొక్కడికే తెలిస్తే నాతప్పు క్షమింపబడదా అను కున్నాను. కాని నువ్వు కథ నిలా తారుమారు చేస్తా వనుకో లేదు. నీ వింత పిచ్చిపని చేస్తావనుకో లేదు. ఎలాగైనా ఇంక ఇలాంటి పని యెప్పుడూ చేయకుండా బుద్ధిచెప్పావు. అస

లిప్పు డీ గండంనుంచి తప్పించుకోవడ మెలా? అది రేపు ప్రొద్దున ఎవడిదో తెలిసిపోతే నా అసలుపేరుకు వచ్చే అప ఖ్యాతికి అంతేమి ఉంటుంది? నన్ను ఖూనీ చేశావురా' అన్నాడు.

'అరే ఎంత పని జరిగిపోయిందిరా! ఇలాగని తెలిసి ఉంటే నే నలా చెయ్యకనే పోదును. ఏదో సంతోషం ఉండబట్టలేక చేశాను. నువ్వసలు నా కా పేరు చెప్పకుండానే ఉండవలసింది. పోనీ చెప్పినప్పు డీ సంగతికూడ చెప్పేసిఉంటే ఎంతబాగుండును? సరే ఏమి చేస్తాం. అందాక ఈ సంపాదక వాక్యాలు చదువుకుని ఆనందిస్తూ ఉంటే సరి, నా దృష్టిలో నీవు తక్కువ వాడివై పోవులే. నీ విప్పు డానందించ గలిగితే నిజంగా గొప్పవాడివే' అని ఆపుస్తకం వాడిముందు పడేశాను. వా డది చూసి 'అరే! నేను దొరికిపోయానన్న మాట... ఇది తెలిసి ఉండికూడ నువ్వు—అబ్బే, వుత్తరం వ్రాయలేదు. ఎంత డబాయించావు. హారి పిడుగా! నా సంగతంతా దొంగిలించావు. అయితే ఒట్టును సార్థకం చేశావన్నమాట...'

'అయితే ఈసారి ఎవరిది దొంగిలిస్తా' వన్నా.

'ఇంకా నయం' అన్నాడు. చాల ముక్తసరిగా నొచ్చుకుంటూ!...'అయితే, ఇక నీవు చూసిన కలను సాధించడానికి తప్పక ప్రయత్నం చేస్తావుకదూ...' అని వాడి దృష్టిని మళ్లించా...

'తప్పక కృషిచేస్తారా. మరి ఈ క్రొత్తపేరు కూడ ఎవ్వరికీ చెప్పనని ఒట్టువెయ్యి' అని వాడంటూ వుంటే నాకు నవ్వు వచ్చింది.

——